నానోపై వెనుకడుగు


పెంచికల్‌పేట్‌లో యూరియా పంపిణీ కేంద్రం వద్ద రైతులు (ఫైల్)

- యూరియా దొరక్క రైతుల తిప్పలు
- గంటల తరబడి క్యూలైన్‌లలో నిరీక్షణ
- నానో యూరియా మేలంటున్న అధికారులు
- ఆసక్తి చూపని రైతులు

పెంచికల్‌పేట్: పంటలు సాగు చేసి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ రైతులకు సరిపడా యూరియా అందడం లేదు. క్షేత్రస్థాయిలో యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నా రైతులు నానో యూరియాపై ఆసక్తి చూపడం లేదు. నానో యూరియా వాడకం వల్ల పంటల ఎదుగుదల లోపిస్తుందని రైతులకు ఉన్న అపోహల్లో నిజం లేదని, నానో యూరియాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. పది రోజుల క్రితం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. గత నెల రోజులుగా మండలానికి సరిపడా యూరియా సరఫరా లేక పోవడంతో అన్నదాతలు యూరియా కోసం అవస్థలు పడుతున్నారు.

15 వేల ఎకరాల్లో సాగు..

మండలంలో రైతులు సుమారు 15వేల ఎకరాల్లో పత్తి, వరి పంటలు సాగు చేస్తున్నారు. పత్తి పంట సాగు చేసి 70 నుంచి 90 రోజులు, వరి పంట వేసి 40 నుంచి 60 రోజులు కావస్తుంది. అధికారులు యూరియా కొరత నేపథ్యంలో పంపిణీ కేంద్రాల్లో ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా మాత్రమే అందజేస్తున్నారు. 5 నుంచి 10 ఎకరాలు సాగు చేస్తున్న రైతులు యూరియ సరిపోక, కౌలు రైతులు పట్టా పాసు పుస్తకాలు లేక యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. పంటలు ఎదిగే సమయంలో యూరియా లేకపోతే పంటల ఎదుగుదల తగ్గి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఏడెకరాల్లో సాగు చేస్తున్న..



నాలుగు ఎకరాల్లో పత్తి, మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాను. యూరియా పంపిణీ కేంద్రంలో కేవలం 5 బస్తాల యూరియా మాత్రమే ఇచ్చారు. దీంతో పంటలకు సరైన మోతాదులో యూరియా అందించలేక పోతున్నా. మొక్కల పెరుగుదల పూర్తిగా ఆగిపోయింది. వర్షాలు కురుస్తున్నా పంటలకు యూరియా అందించే పరిస్థితి లేదు. యూరియా కొరత పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

– మానెపల్లి రాజన్న, రైతు, ఎల్లూర్

నానో యూరియా వాడాలి

యూరియా కొరత నేపథ్యంలో డిమాండ్‌కు సరిపడా యూరియా సరఫరా జరగడం లేదు. రైతులు యూరియా బదులుగా నానో యూరియాను పంటలపై స్ప్రే చేయాలి. ఒక బస్తా యూరియా రూ. 266గా ఉంది. నానో యూరియా 250 మి.లీ రూ.150 – రూ.200 దొరకుతుంది. నానో యూరియాపైన ఉన్న అపోహలను వీడాలి. రైతులు పంటల పైన నానో యూరియాను పిచికారీ చేసుకోవాలి. – మనీషా, ఏవో, పెంచికల్‌పేట్

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: తపాల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, లీడ్ డిస్ట్రిక్ మేనేజన్ రాజేశ్వర్ జోషి, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్‌తో కలిసి పోస్టల్ శాఖ సేవలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తపాలా కార్యాలయాలల్లో పొదుపు ఖాతాలు తెరవడం, పీఎం కిసాన్, గ్యాస్ రాయితీ, అన్నిరకాల బిల్లు చెల్లింపులు చేయవచ్చని తెలిపారు. ఏడాదికి రూ.565 ప్రీమియం చెల్లించి రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా, రూ.345 చెల్లిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

ఆసిఫాబాద్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎంలను భద్రపరచిన గోదామును అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎం గోదాము వద్ద 24 గంటలు నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. గోదాము వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని, అవసరమైన రక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

‘బీజేపీ, కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీలు’


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కౌటాల: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతు వ్యతిరేక పార్టీలని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా విఫలమైనట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో బైక్ ర్యాలీ తీసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్ ప్రాంతాన్ని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు దోచుకున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం పలువురు పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, మండల కన్వీనర్ బండు, కోకన్వీనర్ ఆదే నాందేవ్, నాయకులు కొంగ సత్యనారాయణ, అర్షద్ హుస్సేన్, వెంకటేశ్, సత్యనారాయణ, నవీన్, సాయి, కార్తీక్, జనార్దన్, మమత, లలిత తదితరులు పాల్గొన్నారు.

మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం


పెంచికల్‌పేట్: క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: నిత్యావసర సరుకులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, సత్యనారాయణ, హరీశ్, సంతోష్, కాంతారావు, భుజంగరావు, నాగేశ్, పురుషోత్తం, బాపూజీ, రవీందర్, అజయ్, రాజన్న, ప్రసాద్, నానయ్య, కమలాకర్, అనంతరావు, నరేశ్, వెంకన్న ఉన్నారు.

కౌటాల: బీజేపీతోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి రాజేందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీజేపీ నాయకులు భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు మేలు కలిగేందుకు కేంద్ర ప్రభుత్వం దేశంలో జీఎస్టీపై సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. అనంతరం పలువురు బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, నాయకులు భూమయ్య, మధుకర్, బాబురావు, తిరుపతి, వెంకటేశ్, సంజీవ్, మారుతి, సునీల్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: దేశ ప్రజల సంక్షేమమే బీజేపీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేంద్రే సుబోధ్‌కాంత్, మండల అధ్యక్షుడు మెస్రం జానేశ్వర్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నిత్యవసరాలపై జీఎస్టీ తగ్గించడంపై హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు

కాగజ్‌నగర్‌టౌన్: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలతో పాటు మెమోంటోలను సోమవారం ఎంఈవో వాసాల ప్రభాకర్, ఎంపీడీవో కోట ప్రసాద్‌లు అందజేశారు. ఎమ్మార్సీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల కృషిని గుర్తిస్తూ ప్రతీ స్కూల్ కాంప్లెక్స్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 11 మంది ఉపాధ్యాయులను ఎంఈవో సుభాష్ సన్మానించారు.

అభ్యర్థుల జాబితా ప్రదర్శన

ఆసిఫాబాద్: వ్యవసాయ శాఖలో ఖాళీగా ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారుల పోస్టుల భర్తీ కోసం అర్హులు, తిరస్కరించిన దరఖాస్తు దారుల జాబితా జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రదర్శించినట్లు జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్యశిబిరం

బెజ్జూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెంచికల్‌పేట మెడికల్ ఆఫీసర్ అర్షిన్ అన్నారు. సోమవారం బెజ్జూర్ మండలం కృష్ణపల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

నాణ్యమైన విద్యాబోధన చేయాలి

బెజ్జూర్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఏటీడీఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం సోమిని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు.

టీఎల్‌ఎం మేళాతో బోధన సులభతరం

వాంకిడి: టీఎల్‌ఎం మేళాతో బోధన సులభతరమవుతుందని మండల విద్యాధికారి శివచరణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వివిధ రకాల బోధనోపకరణాలు ప్రదర్శించారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన గిరిగల సంతోష్ అనే యువకుడు ఈనెల 5వ తేదీ నుంచి కనపడడం లేదని సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. వినాయక నిమజ్జనం కోసం ఇంటి నుంచి బయటకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన సంతోష్ ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం సంతోష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘సింగరేణిలో దసరా సెలవు తేదీ మార్చాలి’

రెబ్బెన: డబ్ల్యూసీఎల్ సంస్థలో మాదిరిగా సింగరేణి సంస్థ లోనూ దసరా పండుగ తేదీని మార్చాలని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు డిమాండ్ చేశారు. దసరా పండగ తేదీ మార్పు కోసం హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో ప్రచురించిన వాల్‌పోస్టర్లను సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని అన్ని డిపార్టుమెంట్లు, ఖైరగూడ ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీలో అతికించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2న గాంధీ జయంతితో పాటు దసరా పండుగ ఒకే రోజు వస్తుండటంతో కార్మికులు పీహెచ్‌డీని నష్టపోవాల్సి వస్తుందన్నారు. సింగరేణి యాజమాన్యం తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తూ దసరా పండుగ తేదీని మార్చి కార్మికులు పీహెచ్‌డీ నష్టపోకుండా చూడాలన్నారు.

పర్వతారోహకుడు కార్తీక్‌కు సత్కారం

కెరమెరి: కెరమెరి మండలం కెలి కె గ్రామానికి చెందిన పర్వతారోహకుడు గిత్తే కార్తీక్‌ను హైదరాబాద్‌లోని ఎయిమ్స్ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో సోమవారం ఘనంగా సత్కరించారు. కాలేజీ డైరెక్టర్ నామా సతీశ్ మాట్లాడుతూ మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థి హిమాచల్ ప్రదేశ్‌లోని స్పీటి వ్యాలీలోని మౌంట్ కానామో శిఖరాన్ని అధిరోహించడం ఎంతో గర్వకారణమన్నారు. కార్తీక ధైర్యం, పట్టుదల ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ప్రతిఒక్కరూ కష్టపడి తమ కలలను నెరవేర్చుకోవాలని సూచించారు.

శిక్షణ కోసం అర్చకులు పయనం


అర్చకులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

కెరమెరి: కరీంనగర్ జిల్లాలో హిందూ ధర్మ జాగరణ ఆధ్వర్యంలో రెండు రోజులుగా కొనసాగుతున్న దేవాదాయ అర్చక శిక్షణా తరగతులకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్చకులు సోమవారం బయలుదేరి వెళ్లారు. కరీంనగర్‌లోని శ్రీశ్రీశ్రీ మహా యోగిని మాతా మునీకేశ్వరి దేవాలయం తీగల గుట్టపల్లిలో నిర్వహించే ఈ శిక్షణలో ధూప, దీప నైవేద్యంపై వివరిస్తారని అర్చకుడు ధన్‌రాజ్ తెలిపారు. అంతకుముందు శివాలయంలో అర్చకులకు కెరమెరి గ్రామ పెద్దలు కేంద్రె జగన్, రామకృష్ణ, గిత్తె గణేశ్, బాలాజీ, న్యానేశ్వర్, రాంచందర్ కండువాలతో సన్మానించారు.

ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు

కెరమెరి: మండలంలోని సావర్‌ఖెడ పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రారంభం నుంచి విధులు నిర్వహించిన పూర్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు. రంగయ్య మాస్టారు చేస్తున్న కృషిని, ఆయన సతీమణి వీణ అందిస్తున్న ఉచిత విద్యను కొనియాడారు. ఎంఈవో ఆడే ప్రకాశ్ గ్రామ పటేల్ లక్ష్మణ్, రంగయ్య సార్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానించి మెమోంటోలు అందించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రదీప్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అంతకు ముందు మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు గంగాభవాని, షేక్ బడేసాహెబ్, లక్ష్మీ, భారతి, సంతోష్, ఆత్మరామ్, ఈశ్వర్‌రావు, ఉజ్వల, భాగ్యశ్రీ, నాగరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక


కూటికల ఆనంద్‌రావు


మడావి అనిల్

కెరమెరి: సీఐటీయూ మండల నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ముంజం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో మండల కన్వీనర్‌గా కూటికల ఆనందరావు, కో కన్వీనర్‌గా మడావి అనిల్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులు జాదవ్ అనుసూయ, అనిషెట్టి రమేశ్, తిరుసుల్ల సంతోష్, సిడాం సరోజ, పార్ల స్వామి, రాధా, భారతి, పండులు ఎంపికయ్యారు.

రాజకీయ పార్టీలతో సమావేశం


పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్


కౌటాల: సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు జాబితాలపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఎంపీడీవో అల్బర్ట్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదు ఎంపీటీసీ స్థానాలతో పాటు, జెడ్పీటీసీ ఓటరు జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల అధ్యక్షులు చంద్రమౌళి, రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండలంలోని వివిధ పార్టీల ప్రతినిధులతో ఎంపీవో మహేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారుల ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాను రూపొందించి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఓటర్ జాబితాపై అభ్యంతరాలుంటే తెలుపాలన్నారు. ఈ నెల 10న గ్రామ పంచాయతీల్లో ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ నికాడే గంగారాం, మాజీ ఎంపీటీసీ సభ్యులు దుర్గం మోతిరాం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి రాజేందర్‌గౌడ్, బీజేపీ మండలాధ్యక్షులు కుంచాల విజయ్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాల్లో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, 9 ఎంపీటీసీ స్థానాలకు 49 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా ‘మిలాద్ ఉన్ నబీ’

వాంకిడి: మండల కేంద్రంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లిం మైనారిటీ కమిటీ మండల అధ్యక్షుడు షేక్ హమీద్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సర్వ మానవ సమానత్వం, శాంతి స్థాపనే లక్ష్యంగా సాగిన ప్రవక్త బోధనలతో ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పెంచికల్‌పేట్: పాఠశాలలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పెంచికల్‌పేట్ కాంప్లెక్స్ హెచ్‌ఎం యాదగిరి అన్నారు. మండలంలోని ఎల్కపల్లి, కేజీబీవీ పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం అందించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతి తెలుసుకోవడానికి వారిని ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎస్‌వో కవిత, హెచ్‌ఎం భాగ్య, సీఆర్‌పీ శ్యాం సుందర్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చర్చిల్లో ప్రార్థనలు

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని విజయనగరం, యాపలగూడ క్యాథలిక్ చర్చిల్లో సోమవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు ప్రభువు తల్లి మరియమ్మ జన్మదిన పండుగ నేపథ్యంలో ఆరోగ్య మాతకు ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. మరియమ్మ విగ్రహాల వద్ద కొవ్వొత్తులు వెలగించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో చర్చిల్లో భక్తుల సందడి నెలకొంది. కార్యక్రమాల్లో చర్చి ఫాదర్లు సీజో, టోమో, శేరిన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్ వీధికి చెందిన వ్యాపారి తాటిపెల్లి సతీశ్ ఇంట్లో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండో ఫ్లోర్‌లోని గదులు పూర్తిగా అగ్నికి దగ్ధమయ్యాయి. సతీశ్ కుటుంబ సభ్యులు రాత్రి పైఫ్లోర్‌లోని ఏసీ ఆన్ చేయగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. వారు వెంటనే కిందికి వచ్చి ఫైర్‌స్టేషన్‌కు, విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఫైర్ సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకోక పోవడంతో కళ్లముందే ఇల్లు దగ్ధమైంది. పై ఫ్లోర్‌లోని సీలింగ్, ఫర్నిచర్‌కు మంటలు వ్యాపించడంతో క్షణాల్లో ఇల్లు దగ్ధమైంది. ఇంట్లోని గృహోపకరణాలు, ఇతర విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దీంతో ఫైర్ సిబ్బంది తీరుపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నష్టం వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది.

పాఠశాల సమస్యలపై ఆరా

కెరమెరి: మండలంలోని పాటాగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల సమస్యలపై సోమవారం ఎంఈవో ఆడే ప్రకాశ్ ఆరా తీశారు. 50 ఏళ్లుగా ఆ గ్రామంలో పాఠశాల లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి విద్యార్థులు చదువుకునేవారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా గ్రామంలో పాఠశాల ప్రారంభించారు. దీంతో అడిషనల్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్‌తివారీ ఆదేశాల మేరకు ఎంఈవో పాఠశాలను సందర్శించారు. పాఠశాల భవనం, మరుగుదొడ్లు కావాలని గ్రామస్తులు కోరారు.

ఉమాపార్థివ లింగేశ్వర భస్మాభిషేకం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో సోమవారం రాత్రి ఉమా పార్థివ లింగేశ్వర భస్మాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

క్లుప్తంగా

నానో యూరియాపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దహెగాం: మండలంలోని మొట్లగూడ, రాంపూర్ గ్రామాల్లోని రైతులకు సోమవారం అధికారులు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానో యూరియా వాడకం వల్ల పంటలకు దిగుబడి వస్తుందన్నారు. పంటలకు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని సూచించారు. రైతులు ఖరీఫ్‌లో ఏయే పంటలు సాగు చేస్తున్నారో సంబంధిత ఏఈవోలకు తెలియజేయాలన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

పెంచికల్‌పేట్: బెజ్జూర్ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో రుణాలు పొందిన పెంచికల్‌పేట్ మండల రైతులు వడ్డీ చెల్లించి రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని సంఘం కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

చింతలమానెపల్లి: బెజ్జూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట రుణాలు పొందిన రైతులు రెన్యువల్ చేసుకోవాలని సంఘం కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ సోమవారం తెలిపారు. సంఘంలో గతేడాది అంతకు ముందు సంవత్సరాలలో పంట రుణాలు పొందిన చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్, కర్జెల్లి, దిందా, కేతిని, చిత్తాం, గూడెం, శివపెల్లి, కోయపల్లి గ్రామాల రైతులు వెంటనే వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. రెన్యువల్ చేయించిన రైతులు అధిక వడ్డీ నుంచి మినహాయింపు పొందాలన్నారు. ఇతర వివరాలకు సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తిర్యాణి: విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హోమియోపతి వైద్యురాలు శ్రీవాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. డెంగీ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యార్థులకు పలు మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఆయూష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సందీప్, ఫార్మసిస్ట్ అంజన్న, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తిరుపతిని సోమవారం మండలంలోని రేషన్ డీలర్లు సన్మానించారు. అంతకు ముందు బీజేపీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు బాపురావు, శ్రీనివాస్, లచ్చన్న, మధుకర్, పెద్ది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

‘అడ ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతుకు నిధులు’

ఆసిఫాబాద్‌రూరల్: అడ ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ తెలిపారు. మండలంలోని ప్రాజెక్టును సోమవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో చర్చించి తాత్కాలిక మరమ్మతు కోసం రూ.40లక్షలు మంజూరు చేయించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పదేళ్ల అధికారంలో ఉన్నా ప్రాజెక్టును పట్టించుకోలేదని ఆరోపించారు. సోమశేఖర్, సుదర్శన్, దీపక్ ముండే, నిజాం, మురళి పాల్గొన్నారు.

భారీ వర్షం.. రైతన్న హర్షం

కౌటాల: కౌటాల మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం నుంచి ఎండ వేడికి, ఉక్కపోతకు గురైన ప్రజలు సాయంత్రం వర్షం కురవడంతో వేడి నుంచి ఉపశమనం పొందారు. వారం రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో వరి పంటలకు సాగు నీరు లేక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. భారీ వర్షం కారణంగా సోమవారం కౌటాల వారసంతలో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. వారసంత స్థలం బురదమయంగా మారడంతో తిప్పలు తప్పలేదు.